# చీకటి తెర

శంకరమంచి పార్థసారథి

రామచంద్రం ఆఫీసునుంచి వచ్చేసరికి ఎనిమిదయింది భర్తను ఎనిమిదింటికి ఆఫీసు నుంచి రావటం మిగతా భార్యలకి ఆశ్చర్యం కల్గించక పోవచ్చునుగాని, రాచంద్రం భార్య తారకి మాత్రం చాలా ఆశ్చర్యమనిపించింది. కారణం, అతడు రాత్రి పన్నెండు గంటల లోపు ఎప్పుడూ రాడని అనుభవం చెప్పిన నిజం, ఆవిడ నమ్మకం కూడా !

ఇంకా చెప్పాలంటే, అతడు ముందుగా వచ్చేసాడంటే ఆవిడికి కాస్త దిగులుగా వుంటుంది అతడు వచ్చినందులకు కాదు – ఆ రోజు ‘ మామూళ్ళు ’ ఏమి లేవేమోనని.

మనిషికి అలవాటుని మించిన దురలవాటు ఇంకోటి వుండదేమో !

తార, రామచంద్రాన్ని పెళ్ళి చేసుకున్నప్పుడు, అతడు సంపాదించే ఏడొందలతోనే బతకాలన్న నిజాన్ని జీర్ణం చేసుకుని కాపురాని కొచ్చింది.

కాని, రామచంౢంద పన్జేసే ఆఫీసు మిగతా ఆఫీసులకంటే భిన్నమైంది.

అతడు పన్జేసే ఆఫీసు కల్పవృక్షమైతే, అతడు చూస్తున్న సీటు బంగారు గుడ్డుపెట్టే బాతులాంటిది.

కొన్ని వేలు, లక్షలు కిమ్మత్తుగల బిల్లులు అతడి చేతులమీదుగా పాసవ్వాలి కొమ్మలు తిరిగి, బొజ్జలు పెంచుకున్న పెద్ద పెద్ద కంట్రాక్టర్స్ గూడా రాచంద్రం ముందు అతడి దయాదాక్షిణ్యాలకోసం వచ్చి నిలబడతారు.

రామచంద్రం చాలా దయగల వాడు.

కానీ అతడి దయకి ఒకరేటుంది. ఆ రేటుని బట్టి, వాళ్ళిచ్చే ముడుపుని బట్టి అతడిలో దయా దాక్షిణ్యాలు పెల్లుబికి వాళ్ళ పన్లు జరుగుతుంటాయి. అసలు, రాచంద్రం వ్యవహారాలన్నీ సాయంత్రం అయిదు తర్వాతే మొదలవుతుంటాయి.

అతడిపై ఆఫీసరు భిక్షపతి కూడా చాలా దయామయుడు. ఆఫీసరు గనక రాచంద్రం కన్నా రెండాకులు ఎక్కువ చదివేడు. అందుకే రామచంద్రం పన్నెండింటికి ఆఫీసు కొచ్చినా రాత్రి తొమ్మిదింటి వర్కు ఆఫీసులో వుండిపోయినా పట్టించుకోక, అతడి శక్తి సామర్ధ్యానికి నవ్వుకుంటాడు.

బిక్షపతి, రామచంద్రం ఆవిధంగా చేయి చేయి కలుపుకుని గత పదేళ్ళుగా ముందుకి సాగుతున్నారు.

రాత్రి తొమ్మిదింటివరకు వ్యవహారాలన్నీ చూసుకుని, వాళ్ళిచ్చిన పచ్చ కాగితాలని, చిత్తుకాగితాల్లాగా జేబులో దోపుకుని బయట పడతాడు రామచంద్రం.

ఒళ్ళు తెలీని స్థితిలో, పన్నెండు గంటలకి ఇంటికి చేరిన భర్తనుచూసి తార గర్వపడుతుంది.

అతడి శరీరాన్ని పక్క మీదికి చేర్చి, అతడి జేబులో ' చిత్తుకాగితాలని బీరువాలో పదిలపరిచాక అతడి మంచం చివరన కూర్చుని భర్తముంగురులను గోముగా నిమురుతుంది.

కానీ, ఆరోజు రామచంద్రం ఎనిమిదింటికి రావటం. అందులోనూ పూర్తి స్పృహలోనే వుండటం ఆమెకంత మంచి విషయంగా అన్పించలేదు సరికదా, ఏదో ప్రళయానికి నాంది పలికినట్టుగా బయపడింది.

" అలా వున్నారేం , అప్పుడే వచ్చేసారేం ? " అని గుచ్చి గుచ్చి ఆదర్దాగా అడిగింది.

రామచంద్రం విసుగ్గా కుర్చీలో కూలబడుతూ " ఏవీలేదు ఇవ్వాళ మనస్సెందుకో అదోలా వుంది " అన్నాడు.

తారకి భయంవేసింది " అంటే ....ఆఫీసులో ...."

రామచంద్రం వులిక్కిపడి " అబ్బే ఆఫీసులో గొడవలేం లేవు. కానీ ఎందుకో విసుగ్గా వుంది. కాసిని వేడినీళ్ళు పెట్టు స్నానం చేస్తాను " అన్నాడు.

తారకి అతడివాలకం కాస్త భయం కల్గించినా, అతడి జేబుల్లో పచ్చకాగితాలు కన్పించకపోయినా, తాతా బిర్లాలవే వ్యాపారాలు అప్పుడప్పుడు మందకోడిగా సాగుతాయిట. మరి అటువంటప్పుడు రామచంద్రం ఎంతటివాడు ? ' అని తనకి తానే సర్ధిచెప్పుకుని, బాయిలరు ముట్టించటానికి లోనికెళ్ళబోతూ ఆగి.

" అన్నట్లు మరిచాను – మీ గురించి ఎవరో వచ్చారు " అంది.

లుంగీ చుట్టుకుంటున్న రామచంద్రం భార్య వంక చూడకుండానే' ఎవరుట ? ' అన్నాడు.

" ఏమోమరి అడిగినా పేరు చెప్పలేదు. అబ్బ ! చాలా అసహ్యంగా వున్నాడు. అట్లాంటివాళ్ళతో వ్యవహారాలేమిటి బాబు ! " అంది విసుగ్గా .

రాచంద్రం ఆశ్చర్యంగా భార్య వంకచూసి " అంటే – ఎలా వున్నాడు " అని ఆత్రంగా అడిగాడు.

" మట్టికొట్టుకుపోయిన బట్టలు, గుబురుగడ్డం, కొబ్బరి పీచులాజుట్టు,

అడుక్కుతినేవాడులా వున్నాడు. అతడితో మాట్లాడాలంటేనే నాకు నామర్దా అన్పించింది ” అంది తార చేతికున్న బంగారు గాజులని చీర కొంగుతో పాలీష్ చేస్తూ.

రామచంద్రానికర్థం కాలేదు. తన కోసం వచ్చే మనుషులెటువంటివాళ్ళో తనకి తెల్సు. వాళ్ళ స్థితి గతులు తెల్సు. డబ్బు ఎక్కువయ్యి దాన్ని ఎలా ఖర్చుపెట్టాలో తెలీక అయోమయంగా తిరిగే ఖరీదైన మనుషులు రిక్షాలాగే వాళ్ళు, అడుక్కు తినేవాళ్ళు తన దగ్గరకి రావటానికి తనేం పేదలపాలిటి పెన్నిదా లేక శానిటరీ ఇన్‌స్పెక్టరా ? కనీసం ప్రజా నాయకుడు కూడా కాదే !

మరి తనకోసం వచ్చిన వీడెవడు ?

అర్ధంగాక అయోమయంగా అడిగాడు “ ఎలా వున్నాడన్నావ్ ఏవన్నాడు ? ”

భర్త మోహంలో ఆందోళన చూసి తారకి కాస్త భయచం అనిపించింది విపులంగా చెప్పింది. చాలా “ అసహ్యంగా గాను, భయంకరంగానూ వున్నాడు. తలుపు తట్టాడు. ఎవరో అనుకుని తలుపుతీసి, ఎవరు కావాలని అనడిగాను. మీ పేరు చెప్పి వున్నారా అని అనడిగాడు. ఇంకా ఆఫీసు నించి రాలేదన్నాను. ఎన్నింటి కొస్తారన్నాడు. తెలీదన్నాను . మీ పేరు చెప్పండి వచ్చాక చెబుతానని గూడా అన్నాను ”

“ ఏం అన్నాడు ? ”

“ చిరునవ్వు నవ్వి వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు ”

రామచంద్రానికి ఒక్కసారిగా నిస్సత్తువ ఆవహించినట్లనిపించి మంచం మీద కూర్చున్నాడు.

తార బాయిలరు అంటించడానికి లోనికెళ్ళింది.

ఎవడూ వీడు ? తనతో వాడికేం పని ? అడిగితే పేరెందుకు చెప్పలేదు ?పేరు గూడా లేని ఫకీరు వెధవా ? ఆ ఫకీరు వెధవకి తనతో ఏం పని ? లేక లేక.... పుష్ప మొగుడా ? ఛ ..ఛ... ఎప్పటిమాట ? అయిదేళ్ళ తర్వాత పుష్ప మొగుడు తనకోసం వస్తాడా ? కాదు కాదు .... పుష్ప మొగుడు కాదు.... మరెవరు ?

“ నీళ్ళు , కాగినాయి స్నానం చెయ్యం”దని భార్యపిలిచేవరకు ఆలోచిస్తూ వుండిపోయాడు రామచంద్రం.

స్నానం చేస్తున్నప్పుడు , భోజనం చేస్తున్నప్పుడు, చివరిఇక పక్కమీదకి చేరాక గూడా ఆ ఫకీరువెధవ ఎంత కాదన్నా అతడి ఆలోచన్లకి అడ్డు తగులుతూనేవున్నాడు.

ఎవడై వుంటాడు ? కొంప తీసి దొంగవెధవ కాదుగదా ? దొంగవెధవైతే తను లేదని

తెల్సి అఘాయిత్యం చెయ్యాలిగదా ? అలాకాక నవ్వేసి ఎందుకెళ్ళినట్టు ? అలా కాక పుష్ప మొగుడేనా ? ”

మళ్ళీ ఆలోచనల్లో పుష్ప....!

రామచంద్రం పక్కకి తిరిగి భార్య వంకచూసేడు. తార గుండెలపై చెయ్యివేసుకుని ప్రశాంతంగా నిద్రపోతోంది. ఆరోగ్యమైన, పుష్కలమైన ఆమె వక్షస్థలం ఉఛ్వాసనిశ్వాసాలకు లయబద్ధంగా ఎగిరెగిరి పడుతోంది.

రామచంద్రం మెల్లిగా భార్య చేతిని తప్పించి, లేచి బయటికొచ్చాడు.
బయటివాతావరణం చల్లగా వుంది.

సిమెంట్ అరుగుమీద కూర్చుని సిగరెట్ ముట్టించాడు.

పుష్ప ! అయిదేళ్ళనాటి పుష్ప ఇప్పుడెక్కడుంది ? బ్రతికేవుందా ? ఇప్పుడు తనకోసం వచ్చాడన్న ఫకీరు వెధవ పుష్ప మొగుడు పతంజలి కాదుగదా ? అతడికింకా తనమీద కక్షగానే వుంటుందా ?

రామచంద్రం సిగరెట్ గట్టిగా పీల్చి గోడనానుకొని కళ్ళు మూసుకున్నాడు.

పుష్పనడిచొచ్చి అతడికెదురుగా నిల్చుంది..

పుష్ప ఎంతందగత్తె ? తార చాలా అందంగా వుంటుంది. తార లాంటి భార్య కావాలని చాలామంది కలలు కంటారు. కాని పుష్పముందు తార, చంద్రుడి ముందు తారే !

అందానికంతంలేదని అతనికప్పుడే తెల్సింది.

పుష్ప ! ఆమె కళ్ళు, పెదవులు , ముక్కు రొమ్ములు, నడుము, పిరుదులు....అబ్బ ! ఆ భగవంతుడామెకి ప్రతి అవయవంలోను అందాన్ని రంగరించి పోసాడు. ఆమెనలా చూస్తుంటే, కళ్ళు మూతలు పడవు, ముక్కు గాలి పీల్చడం మర్చిపోతుంది. గుండె పరుగు పందెం వేస్తుంది.

కాని ఏం లాబం ? అంత అందానిచ్చిన భగవంతుడు ఆమె నొసటన అంత అందమైన దస్తూరి వ్రాయలేదు.

ఆమె భర్త పతంజలి అతి సామాన్య మైన వుద్యోగి. అతడికి బాధ్యత లెక్కువ. కొడుకుపంపే డబ్బుకోసం ఎదురుచూసే తల్లి, తండ్రి, పెళ్ళి కావాల్సిన చెల్లెలు...మధ్య తరగతి కటుంబాల్లో మొదటివాడుగా పుట్టిన ప్రతి యువకుడు ఎదుర్కొనే సమస్యలన్నీ పతంజలి కున్నాయ్.

అంతఅందమైన పుష్ప ఏ ఫియట్ కారులోనో తిరుగుతూ, పెద్ద బంగళాలో

వుండకుండా, పతంజలిని పెళ్ళాడి మిడిమిడి బ్రతుకులు బ్రతకటం రామచంద్రానికి చాలా బాధనిపించింది.

తార, పుష్ప క్లాస్‌మేట్స్ చిన్ననాటి స్నేహితులు, తరచుగా పుష్ప వస్తుండేది. తన వ్యధలు, భాదలు తారకి చెపుతుంటే రామచంద్రం వింటుండేవాడు.

ఆ విధంగా పుష్ప రామచంద్రంల పరిచయం చిగురించి, అనతికాలంలోనే మొగ్గతొడిగి , పుష్పించింది.

తారపరోక్షంలో గూడా వాళ్ళిద్దరు సన్నిహితంగా మాట్లాడుకునేటంత పరిచయం ఏర్పడింది.

ఒకసారి తార, వాళ్ళ నాన్నకి గుండెపోటువచ్చిందని తెల్సి అనుకోకుండా పుట్టింటి కెళ్ళింది.

ఆ రోజు రామచంద్రం ఆఫీసుకెళ్ళటానికి సన్నద్ధుడౌతున్నాడు. ఉదయం పదకొండు గంటలవుతుంది. పుష్ప హడావుడిగా వచ్చింది. ఆమె మొహం దైన్యంతో నిండిపోయింది. కళ్లు ఎర్రబడి వాచినట్లు న్నాయి. ఏదో విషయం గూర్చి ఆమె బాధపడుతూందని ఇట్టే తెల్సిపోతోంది.

తారవూళ్ళో లేదని తెల్సి నీళ్ళుకారిపోయి, కుర్చీలో కూలబడిపోయింది.

ఆమె అంత బాధలోనూ రామచంద్రం కళ్ళకి అందంగా కన్పించింది. తనలో కలుగుతున్న అలజడిని బలవంతాన అణచుకుంటూ విషయమేమిటనడిగాడు..

చక్రాల్లాంటి ఆమె కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి.

పమిటకొంగుతో కన్నీళ్ళ నాపుకుంటూ చెప్పిన సారాంశం :

“ పతంజలి ఆఫీసు డబ్బు పదిహేనొందలు వాడుకున్నాడు. హెడ్డాఫీసునుంచి ఇన్‌స్పెక్షన్ కొస్తున్నారు. రేపటిలోగా డబ్బు కట్టకపోతే అతడుద్యోగమే పోవచ్చు ”

అది విన్న రాచంద్రంలో విచిత్రమైన భావన కల్గింది.

మనం ఏ బస్సు కోసమో, రైలు కోసమో ఎదురుచూసి, విసుగెత్తిన తరుణంలో, ఆ బస్సో రైలో వచ్చి మనముందు నిల్చున్నప్పుడు కలిగే సంతోషం, సంచలనం.

రామచంద్రం ధైర్యం చెబుతున్న వాడిలా “ బాధపడకు పుష్పా ! నీకొచ్చిన ఆపదని నేనాదుకోగలను. నీ సమస్యని తీర్చగలను. కానీ, మరి నాకో సమస్యుంది తీరుస్తావా ? ” అన్నాడు.

ఆమె ఎర్రబడిన కళ్ళలో ఆశ్చర్యం తొంగిచూసింది. ‘ ఏమిటది ’

అతడు తియ్యగా నవ్వేడు. ఆ తీపి వెనకాలున్న చేదు ఆమెకర్ధం కాలేదు.

" సాయంత్రం మీ ఇంటికొస్తాను అప్పుడు నా సమస్యని నీ ముందుంచుతాను "

పుష్ప కళ్ళతోనే కృతజ్ఞతల్జెప్పి కదిలిపోయింది.

ఆ సాయంత్రం ఎందుకనోత్వరగా చీకటిపడింది. ప్రళయం రాబోతున్నట్లుగా ఆకాశం వురుముతోంది.

సరిగ్గా రామచంద్రం ఆరుగంటలకి ఆమె ఇంటికెళ్ళాడు.

వీధి తలుపు దగ్గరగా వేసుంది. మెల్లిగా తలుపు తోసి ముందుగదిలో కెళ్ళాడు

పుష్ప ఒంగుని మధ్య గదిని వూడుస్తోంది. ఆమె రామచంద్రం రాకని గమనించలేదు. ఒక చెయ్యి నడుం మీదుంచుకుని వూడుస్తున్న ఆమె భంగిమ అతడి కళ్ళకి అపురూపమైన కళాఖండంగా తోచింది.

అతడు కాళిదాససయితే ఆ క్షణంలో కవిత్వం రాసేవాడు.

పికాసో అయితే అద్భుతమైన చిత్రాన్ని గీసేవాడు.

దేవలపల్లయితే బ్రహ్మాండమైన భావగీతాన్ని వ్రాసేవాడు.

అతడేది కాదుగనక అలా కొన్ని క్షణాలు చూస్తూ నిలబడి పోయాడు. అలా నిలబడ్డ అతడిలో ఆమె పట్ల పెంచుకున్న కోర్కె రెక్కలు విదిలించింది. కామం కట్టలు తెంచుకుంది. తనని తాను నిగ్రహించుకోలేని పరిస్థితిలో, వీధి తలుపు గడియపెట్టి, మెల్లగా మధ్య గదిలోకెళ్ళాడు

అలికిడి తలెత్తిన పుష్ప, ఎదురుగా నిల్చున్న రామచంద్రాన్ని చూసి వులిక్కిపడింది.

" మీరా ? ఎంతసేపయిందివచ్చి ?నే చూడనేలేదు " అంది తొందరపాటుని దాచుకోవాలని ప్రయత్నిస్తూ.

రామచంద్రం ఏమి మాట్లాడలేదు. అతడి పెదాలపైన నవ్వులో భయం, కోర్కె, ఆవేశం కలగటం వల్ల అతడి మొహం అర్ధంకాని వర్ణచిత్రంలా వుంది.

మళ్ళీ పుష్ప " అలా ముందుగదిలో కూర్చోండి, కాఫీ తెస్తాను " చేతిలో చీపురు క్రిందపడేసి , వంటింట్లో కెళ్ళబోయింది.

రామచంద్రం ఏమాత్రం ఆలస్యం చెయ్యలేదు. చటుక్కున ఆమె చెయ్యందుకుని తనమీదకి లాక్కుంటూ " నాక్కావాల్సింది కాఫీ కాదు పుష్పా " అన్నాడు.

అప్పుడు గాని అతడి అసలు రూపం ఆమెకర్ధంకాలేదు. ఇన్నాళ్ళు ఆపేరు వెనకాల దాక్కున్న లంకాధీశ్వరుడు ఆమె కాక్షణంలో కన్పించాడు.

" ......వదలండి, ఇది మీకు సబబు కాదు. కష్టంలో వుండి మీ సహాయంకోరితే " వుక్కుస్తంభాల్లాంటి అతడి బాహువుల్లోంచి బయట పడాలని ప్రయత్నిస్తూ అరుస్తోంది పుష్ప.

రామచంద్రానికి ఆమె మాటలు వినిపించటంలేదు. పైట తొలిగి, జాకెట్టులోంచి కన్పిస్తున్న ఆరోగ్యమైన, పుష్కలమైన అందం, అతడి కళ్ళకి తోలుతీసిన ముంజలు తామరాకులో పెట్టినట్లుగా అన్పించి అనుభవించమని తొందరచేసింది

రామచంద్రం తొందరపడ్డాడు

ఆమెనొక్కసారిగా ఎత్తుకుని ప్రక్కనున్న మంచంపై పడేసి ఆమె నాక్రమించుకున్నాడు. అతడిబారి నుంచి తప్పుకోవాలని ఆమె విశ్వప్రయత్నం చేస్తోంద.

కాని రామచంద్రం ఆమెకావకాశం ఇవ్వకుండా, తనక్కావాల్సిందేమిటో తీసుకోనారంభించాడు.

అతడి చేతులు ఎక్కడెక్కడో పయనిస్తున్నాయ్.

" పుష్పా నవ్వంటే నాకు ప్రాణం. నన్ను కాదనకు. నిన్ను తారకన్నా ఎక్కువగా చూచుకుంటాను. "

పుష్పగింజుకుంటోంది. రామచంద్రం ఆమెని మెల్లి మెల్లిగా లోబర్చుకుంటున్నాడు.

ఒకటి...రెండు ....మూడు ...

క్షణాలు దొర్లిపోతున్నాయి. దొర్లిపోయిన ప్రతిక్షణం చరిత్రయి కూర్చుంటుంది.

ఆ గదిలో, ఆ సమయంలో దొర్లిపోయిన కొలది క్షణాలు రామచంద్రానికి తీపి గుర్తుగా నిల్చిపోతే, పుష్పకి మాయనిమచ్చగా మిగిలిపోయింది.

రామచంద్రానికి ఆకలి తీరింది. వేడి చల్లారింది.

ఆడదాని నిస్సహాయత, మొగవాడి పైశాచికత్వం పోటీపడితే, పైశాచికత్వమే గెలుస్తుందన్న సంగతి మరొక్కసారి రుజువైంది.

రామచంద్రం మెల్లిగా మంచం దిగేడు. తన దుస్తులు సరిచూసుకున్నాడు. పుష్ప వెల్లకిలా పడుకునుంది ఆమెలో చలనం లేదు.

రామచంద్రం మెల్లిగా ' క్షమించ పుష్పా ' నేకాస్త మొరటుగా ప్రవర్తించానేమో నా తత్వమే అంత. నాక్కావాల్సింది తీసుకుంటే కానీ నిలవలేను. జరిగింది మర్చిపో ! అన్నట్లు వుదయం డబ్బులడిగావ్ కదూ ! ఇదిగో ' అంటూ జేబులోంచి డబ్బు తీసి పుష్ప వంక చూసేడు.

ఆమెలో కదలికలేదు.

అతనా డబ్బుని మంచంమీదుంచుతూ , మనం చేసింది తప్పుకాదు పుష్పా అతి సహజమైనది. జస్ట్ బయోలాజికల్ ఆర్జి ! ఎంతోకాలం సాగాల్సిన మన స్నేహానికి నాంది. వెళ్ళొస్తా ' అని వెళ్ళబోతూ ఆమె వంక చూసేడు.

ఆమె అలాగే పడుకునుంది. గుడ్లు పైకిపోయాయ్. కాళ్ళు చేతులు స్వల్పంగా కొట్టుకుంటోంది నోట్లోంచి తెల్లటి నురగ ప్రక్కగా కారుతోంది.

రామచంద్రం గుండె రేసుగుర్రంలా పరిగెత్తనారంభించింది.

" ఫిట్స్ ! పుష్పకి ఇంతవరకు తనకాసంగతే తెలీదే ? ఇప్పుడేం చెయ్యాలి ?'

ఇందాకటికన్నా ఆమె కాల్ళు చేతులు వేగంగా కొట్టుకుంటున్నన్నయ్. అతడికేం చెయ్యాలోతెలీక రాయిలా నిల్చున్నాడు.

అంతలో వీధి తలుపు చప్పుడైంది.

అతడిలో కంగారెక్కువైంది. చక చకా వెళ్ళి తలుపు తీసాడు, వాకిట్లో పతంజలి నిల్చునున్నాడు రామచంద్రాన్ని చూసి

" మీరా ? " అన్నాడు అర్థంకాని ఆశ్చర్యంతో.

అతడిని చూసి రామచంద్రం గతుక్కుమన్నాడు ' పుష్పకి ఫట్సొచ్చి పడిపోయింది ' అన్నాడు. ఆదుర్దాగా.

పతంజలి ఆ మాటవిని చటక్కున అతడిని దాటుకుని మధ్య గదిలోకెళ్ళాడు అంతే ! రామచంద్రం మెల్లిగా తలుపు దగ్గరగా వేసి, బయటి కొచ్చాడు.

అటు తర్వాత పుష్ప గురించిని సమాచారం చాలా రోజులు వరకు తెలీలేదు. రెండు నెలల తర్వాత తార తిరిగొచ్చి ఒకరాత్రి భోజనం వడ్డిస్తూ.

" ఈ సంగతి తెల్సా ! పుష్ప క్కిసనాయిలు పోసుకుని ఒళ్ళు కాల్చుకుందిట " మెల్లిగా చెప్పింది.

నోట్లో పెట్టుకోబోతున్న ముద్ద జారి క్రిందపడింది రామచంద్రానికి .

" ఎప్పుడు ? "

" మొన్న నేను వూరెళ్ళినప్పుడు. అసలు డాక్టర్ను బతకదని చెప్పారట. కానీ పాపం, బతికింది –చక్కటి మనిషి – చాలా అసహ్యంగా , భయం కరంగానూ వుందిట. ఎందుకు బ్రతికించారని ఏడుస్తోందిట. ప్రస్తుతం వాళ్ళ అమ్మ నాన్న వద్ద వుందిట. భర్తకి మళ్ళీ పెళ్ళిచేసుకోమని వ్రాసిచ్చిందిట "

ఆమె చెబుతున్న ప్రతిమాట చాలా జాగ్రత్తగా వింటున్నాడు రామచంద్రం. తర్వాత మెల్లిగా అడిగాడు – " అసలెందుకిలా చేసిందిట ? "

" ఏమో కారణం ఎవ్వరికీ తెలీదు. పతంజలి గూడా మంచివాడే. చాలా ప్రేమగా చూసుకునేవాడు. మరి ఎందుకలా చేసిందో ఏమో ? "

రామచంద్రం తృప్తిగా నిట్టూర్చాడు. తారకి అసలు విషయం తెలీదు!

అయిదేళ్ళ తర్వాత మళ్ళీ పుష్ప గురించి ఆలోచించాల్సి వస్తుందని గాని, పాతేసిన

గతాన్ని తిరిగి త్రవ్వాల్సివస్తుందని గాని అతడనుకోలేదు. దానిక్కారణం – ఈ ఫకీరు వెధవ ! ఎవడైవుంటాడు ? పతంజలి కాక మరెవరైనా అతడికి భయం లేదు . కానీ పతంజలయితే ?

ఆ వచ్చింది పతంజలి కాదనటానికి అతడివద్ద నిదర్శనాలేం లేవు కానీ కావచ్చుననటానికి ఒక నిదర్శనం వుంది అది పతంజలి వ్రాసిన లోకల్ వుత్తరం. ఈ గొడవంతా అయిన కొన్ని నెలల రామచంద్రానికి ఒక వుత్తరం వచ్చింది. అది పతంజలి వ్రాసిన లోకల్ వుత్తరం. అదిప్పటికి అతడివ్ద పదిలంగా వుంది. దాని సారాంశం : రామచంద్రం, నీ వల్ల సాఫీగా సాగుతున్న మా సంసార నావ తల్లకిందులైంది. నీ అయిదు నిమిషాలు సుఖం కోసం , మా ఇద్దరి బ్రతుకులు మంట గలిపావ్ ! ఆల్‌రైట్ . కానీ గుర్తుంచుకో ! ఎప్పటికయినా, ఎన్నేళ్ళకయినా, నిన్ను దెబ్బతీస్తాను. భాదంటే ఎలా వుంటుందో రుచి చూద్దువుగానీ, ఈ వుత్తరం నీ చావుకి వారెంటుగా భావించు.

ఆ వుత్తరం చూచి చాలాకాలం భయపడ్డాడు కానీ క్రమేణా మర్చిపోయాడు. కాని తిరిగి ఈ ఫకీరు వెధవగూర్చి.....

రామచంద్రం లేచి లోనికెళ్ళాడు. కానీ ఆ రోజు రాత్రి నిద్రపోలేదు.

మార్నాడు ఆఫీసుకి చాలా త్వరగా వెళ్ళాడు. నిద్రలేమి ఎడతెరిపిలేని ఆలోచనలవల్ల మొహం పీక్కుపోయి జబ్బుమనిషిలా అవుపించాడు అతడిలో స్పష్టంగా కన్పిస్తున్న మార్పును చూసి, అతడి కొలీగ్ భాస్కరమూర్తి ఆశ్చర్యంగా ' మార్నింగ్ మిస్టర్ రామచంద్రం ఒంట్లో బాగా లేదా అదోలా వున్నారు ? ' అనడిగాడు.

రామచంద్రం ఏమీ మాట్లాడకుండా , తన సీటులో కూలబడి , వెంట తెచ్చుకున్న పేపరు వెనకాల మొహం దాచుకున్నాడు.

భాస్కరమూర్తికి కాస్త అతిగా మాట్లాడే అలవాటుంది. నిద్రపోయిన కొద్దిగంటలు తప్ప – అతడి నోరు ఎప్పుడూ పన్చేస్తూనే వుంటుంది.

అందుకే మళ్ళీ అన్నాడు. ' ఇవ్వాళ నువ్విలా త్వరగా వస్తావని తెలిస్తే నీగురించి వచ్చిన వ్యక్తిని కూర్చోమనే వాడనే'

రామచంద్రం చేతిలోవున్న పేపరు అప్రయత్నంగా జారిక్రిందకుపడింది. గుండె దడ దడలాడింది. ' ఎవరు ? ఎలా వున్నాడు ? ఎంత సేపయింది ? ' తన కుర్చీలోంచి లేచి , దాదాపు భాస్కరమూర్తి పై వాలిపోతున్నట్లుగా నిలబడి ఆత్రంగా అడిగాడు.

అతడంతగా కంగారు పడటానికి కారణమేమిటో అర్ధంకాక, అయోమయంగా చూస్తూ ' ఎవరో నాకేం తెల్సు ? నీ పేరు చెప్పి రాలేదా అన్నాడు నువ్వు పన్నెండు

గంటలదాకా రావని చెప్పాను ' మెల్లిగా అన్నాడు.

' ఎలా వున్నాడు '.

భాస్కరమూర్తి వర్ణించాడు – వాడే ఫకీరు వెధవ – సందేహం లేదు.

' ఎంతసేపయింది ? '

' దాదాపు అర్ధగంటవుతోంది – ఐనా ఎవరతను – నీ బంధువా, స్నేహితుడా పాపం చాలా దీనస్థితిలో వున్నట్లున్నాడు.

రామచంద్రం తిరిగి తనకుర్చీలో కూర్చున్నాడు. అతడికి తనివితీరా ఏడ్చి, మనస్సుని కుదుటపర్చుకోవాలనిపింఇచింది. ఎవడువాడు ? ఎందుకిలా వెంబడిస్తున్నాడు ? పతంజలా ? పతంజలయితే కక్ష సాధించటానికి అయిదేళ్ళు కాలాన్ని ఎందుకు వృధా చేస్తాడు ? కాకపోతే ఇంకెవరు ? ఆఫీసులో తనవల్ల పన్లుకానివారా ? డబ్బు తీసుకున్నాడు అందరికీ పన్లు చేసి పెట్టానే ఎవరికి తనపై కక్షుంటుంది ?

అంతలో ఆఫీసరునుంచి పిలుపు రాగా, లేచి గదిలోకెళ్లాడు. బిక్షపతి, ఏవో ఆఫీసు విషయాలు గురించి అడిగాడు ముక్తసరిగా బదులిచ్చాడు. రామచంద్రం పరధ్యానంగా వుండటం గమనించి అతడు " ఆల్ రైట్ – యూ కెన్ గో – అన్నట్లు మీకేదో ఫోనొచ్చింది. మిరింకా వచ్చి వుండరని నేనే లేరని చెప్పాను "

ఈసారి రామచంద్రం రియాక్టు కాలేదు.

అతడి మొహం రాయిలా కఠినంగా మారింది. మొహం ఎర్రబడి హంతకుడిలా కన్పించాడు ' అలాగా ' అని మాత్రం బయటికొచ్చాడు అతడిలో సహనం పూర్తిగా నశించింది. ఆ క్షణంలో ఆ ఫకీరు వెధవ కన్పిస్తే పీక నులిమి చంపెయ్యాలని గట్టిగా అనుకున్నాడు.

భాస్కరమూర్తి సీటులో లేడు.

రామచంద్రానికి కూర్చోవాలనిపించక లేచి బయటికొచ్చాడు. మనస్సంతా ఏవిటోగా వుంది. ఎక్కడి కెళ్ళాలి, ఏం చెయ్యాలి ? ఆ వెధవని పట్టుకోవటమెలా ? ఆలోచిస్తూ నిలబడ్డాడు.

భాస్కరమూర్తి ప్రక్కనే వున్న అధునాతనమైన హొటల్లోంచి ఎవరితోనో మాట్లాడుకుంటూ వస్తున్నాడు.

అతడు సమీపంగా రాగానే, రామచంద్రం మెల్లిగా అన్నాడు
' మూర్తీ హెల్ప్ చేస్తావా ? '

" ఏవిటది ? "

" మనస్సు చీకాగ్గా వుంది. యింటి కెళ్ళిపోతున్నాను. నా గురించి మళ్ళీ ఎవరైనా వస్తే మా యింటికి తీసుకొస్తావా ? "

" అలాగే కానీ నువ్వంటున్నది ప్రొద్దునొచ్చిని వ్యక్తి గురించే అయితే అతనా హొటల్లో వున్నాడు. నేనిప్పుడే చూసేను "

అంతే ! ఆ మాట విని వినటంతోనే భాస్కరమూర్తిని బలంగా అవతలికి నెట్టి హొటల్లోకి పరిగెత్తాడు. లోనికి ప్రవేశించి, ఎదురుగా వున్న మెట్లెక్కి పైకెళ్ళబోతూ ఠక్కున ఆగిపోయాడు.

వాడే – వాడే – ఆ ఫకీరు వెధవ మెట్ల వంపులో నిల్చున్నాడు. రామచంద్రాన్ని చూసి నిర్లక్ష్యంగా నవ్వుతున్నాడు.

అతడిని చూడంగానే రామచంద్రానికి కోపంతో రక్తప్రసరణ పెరిగి, నరాలు పెట్లిపోతాయేమో ననిపించింది. వాడిని చూసి కోపంగా అరిచాడు. " ఎవరు నువ్వు "

సమాధానం లేదు. వాడలాగే నవ్వుతున్నాడు.

" ఎందుకు నన్నిలా వెంటాడుతున్నావ్ ? "

మళ్ళీ సమాధానం రాకపోవడంతో వాడిని పరీక్షగా చూసేడు ఒక్క క్షణం పతంజలిలా అనిపించాడు. మరుక్షణం కాదనిపించేలా వున్నాడు ఎవడు వీడు ? ఎవరైతేనేం తన మనశ్శాంతిని దోచుకున్న దొంగవెధవ – వీడిని వదిలెయ్యకూడదు ' అనుకుని ' రాస్కెల్. ఎవడ్రా నువ్వు ' అంటూ చెయ్యెత్తి ముందుకు వెళ్ళబోయి , ఎవరో బలంగా ఆపటం వలన ఆగిపోయి, వెనక్కి తిరిగి చూసేడు.

భాస్కరమూర్తి ! " ఏవిటోయ్ అద్దంలో నిన్ను నువ్వే బెదిరించుకుంటున్నావ్ – " అంటున్నాడు.

రామచంద్రం తలతప్పి ఆ ఫకీరు వెధవ వైపు చూసేడు.

ఇప్పుడు వాడక్కలేడు. వాడి స్ధానంలో గోడకి పూర్తి నిడగివిగల అద్దం గోడకి బిగించబడి వుంది.

ఆ అద్దంలో తన ప్రతిబింబం నీరసంగా కన్పిస్తోంది.

వెనకనించి భాస్కరమూర్తి అడిగాడు " ఇంతకీ అతను కన్పించాడా "

" అవును కన్పించాడు "

" ఎవరతను ? నీ బంధువా ? స్నేహితుడా ?

" ఎవరూ కాదు "

" మరి ? "

" నేనే "

అనేసి బయటికెళ్ళి జనంలో కల్సిపోయాడు రామచంద్రం.

-------- అయ్యిపోయింది --------